క్లుప్తంగా

బాల్య వివాహాల అనర్థాలపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న ఐసీడీఎస్ సిబ్బంది

పెద్దతిప్పసముద్రం : మండలంలోని ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, జయరాణి, నాగరత్నమ్మ, భవానీల ఆధ్వర్యంలో శుక్రవారం పలు అంగన్‌వాడీ కేంద్రాల్లో కిశోరీ వికాసం సెషన్–3 కార్యక్రమం నిర్వహించారు. బాల్య వివాహాల వలన కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. అదే విధంగా మహిళా చట్టాలు, పిన్న వయసులో గర్భధారణ, పునరుత్పత్తి, ఆరోగ్య సమస్యలను క్షుణంగా వివరించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశా వర్కర్లు, ఏఎస్‌ఎంలు పాల్గొన్నారు.

మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ



మజ్జిగ ప్యాకెట్లు అందజేస్తున్న మానవత సంస్థ సభ్యులు

మదనపల్లె సిటీ : వేసవిని దృష్టిలో ఉంచుకుని స్థానిక జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి వద్ద శుక్రవారం మానవత సంస్థ ఆధ్వర్యంలో రోగులు,పాదాచారులకు మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేశారు. సంస్థ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.దీంతో పాటు పలుచోట్ల చలివేంద్రాలు ఏర్పాటు చేసినట్లు సంస్థ అధ్యక్షులు భాస్కరరెడ్డి తెలిపారు. కార్యక్రమంలో డైరెక్టర్లు రెడ్డప్పనాయుడు, ప్రసాద్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

డీవైఈఓకు సన్మానం



డీవైఈఓ లోకేశ్వర్‌రెడ్డిని సత్కరిస్తున్న యూటీఎఫ్ నాయకులు

పీలేరు రూరల్ : మదనపల్లె డీవైఈఓగా బాధ్యతలు స్వీకరించిన పి. లోకేశ్వర్‌రెడ్డిని ఘనంగా సన్మానించారు. పీలేరు ఎంఈవో–1గా పని చేస్తున్న లోకేశ్వర్‌రెడ్డి పదోన్నతిపై మదనపల్లె డీవైఈవోగా ఇటీవల బాధ్యతలు స్వీకరించారు. శుక్రవారం స్థానిక ఎమ్మార్సీ కార్యాలయం వద్ద యూటీఎఫ్ ఆధ్వర్యంలో పలువురు ఉపాధ్యాయులు పూల మాలలతో సత్కరించారు. కార్యక్రమంలో ఎంఈవో పద్మావతి, యూటీఎఫ్ నాయకులు శివారెడ్డి, సుధాకర్, వేణుగోపాల్, మస్తాన్, భాస్కర్, మునిరెడ్డి, సుబ్రమణ్యం, కృష్ణమూర్తి, రెడ్డెప్ప, సురేష్, నాగరాజ, రమణ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గంధోత్సవం



మౌలాకా పహాడ్‌లో గంధం చదివింపులు జరుపుతున్న పీఠాధిపతి

పెద్దమండ్యం : మండలంలోని కలిచెర్ల మౌలాకా పహాడ్ గంధమహోత్సవం గురువారం రాత్రి ఘనంగా జరిగింది. మౌలాకాపహాడ్‌లో కడప అమీన్‌పీర్ దర్గా పీఠాధిపతి హజరత్ సయ్యద్‌షా ఖ్వాజా ఆరీఫుల్లా హుసేనీ ప్రత్యేక ఫాతేహా నిర్వహించారు. గంధం చదివింపులు భక్తి శ్రద్ధలతో జరిపారు. గంధ మహోత్సవానికి మదనపల్లె ఎమ్మెల్యే షాజహాన్‌బాషా, మదనపల్లె నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త నిస్సార్‌అహ్మద్ హాజరయ్యారు. ఒకే రోజు గంధం, ఉరుసు, ఖవ్వాలీ పోటీలు నిర్వహించడంతో భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. మదనపల్లె డీఎస్పీ మహేంద్ర ఆధ్వర్యంలో ముగ్గురు సిఐలు, 8 మంది ఎస్ఐలు, సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు. కార్యక్రమంలో ఇతర ప్రాంతాల నుండి పెద్ద ఎత్తున ముస్లిం సోదరులు తదితరులు పాల్గొన్నారు.

క్యాంపస్ డ్రైవ్‌లో 10 మంది ఎంపిక



క్యాంపస్ డ్రైవ్‌లో ఎంపికైన అభ్యర్థులు

పీలేరు : స్థానిక సీఎస్‌ఆర్ కళాశాలలో నిర్వహించిన క్యాంపస్ డ్రైవ్‌లో 10 మంది ఎంపికైనట్లు కళాశాల కరస్పాండెంట్ విజయభాస్కర్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం ఆల్ డీజీ టెక్నో కంపెనీ బెంగళూరు ఆధ్వర్యంలో క్యాంపస్ డ్రైవ్ నిర్వహించారు. రెండు దశల్లో ఇంటర్వ్యూలు నిర్వహించి 10 మందిని ఎంపిక చేసినట్లు తెలిపారు. ఎంపికైన వారికి రూ. 2 లక్షలు వార్షిక వేతనం అందుతుందని తెలిపారు. కార్యక్రమంలో హెచ్ ఆర్ మేనేజర్ బాబా పక్రుద్దీన్, ప్రిన్సిపాల్ డాక్టర్ లావణ్య, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

నారసింహా.. గోవిందా

వైభవంగా లక్ష్మినారసింహుడి బ్రహ్మ రథోత్సవం

మదనపల్లె సిటీ : మదనపల్లె మండలం సీటీఎంలో వెలసిన శ్రీ లక్ష్మినరసింహస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా బ్రహ్మ రథోత్సవం శుక్రవారం అశేష భక్తజనం మధ్య అత్యంత వైభవంగా జరిగింది. శ్రీ లక్ష్మి నరసింహస్వామి గోవిందా..గోవిందా.... ప్రహ్లాద వరద గోవిందా... గోవిందా, జయ జయ సింహా ..జయ నరసింహా’ అంటూ భక్తులు కీర్తించగా.. గోవింద నామస్మరణతో సీటీఎం పురవీధులు మార్మోగాయి. బ్రహ్మ రథోత్సవం నాడు సాక్షాత్తు బ్రహ్మదేవుడే రథాన్ని నడిపి శ్రీవారు పురవీధుల్లో విహరించేందుకు సహకరించి భక్తులంతా స్వామిని దర్శించుకునేలా చూస్తారని సహకరించి భక్తులంతా స్వామిని దర్శించుకునేలా చేస్తారని భక్తుల నమ్మకం.

బలిహరణం, ఆస్థాన పూజలతో మొదలు : ఉదయాన్నే ఆలయ అర్చక బృందం రుషి, మంజువిక్రమ్, ఆదిత్యాచార్యులు, రామాచార్యులు తేరు ముందు బలిహరణం, ఆస్థాన పూజలుల నిర్వహించారు. సర్పంచు ఆనందపార్థసారధి, మాజీ సర్పంచు ప్రభాకర్‌రెడ్డి, వెలుగు చంద్ర పాటు ప్రముఖులు రథం వద్ద జరిగిన తొలిపూజల్లో పాల్గొని, తర్వాత రథంపై శ్రీవారిని దర్శించుకున్నారు. అనంతరం రథాన్ని లాగి భక్తిని చాటుకున్నారు. ఒకవైపు ఎండలు మండుతున్నా భక్తులు తమ ఇలవేల్పును దర్శించుకుని రథంపైకి మిరియాలు, దవనం చల్లేందుకు గంటల తరబడి వేచి ఉన్నారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. ధార్మిక సేవ ఆధ్వర్యంలో ధూళోత్సవం నిర్వహించారు.



లక్ష్మినరసింహస్వామి మూలవిరాట్టు



రథంపై ఊరేగుతున్న లక్ష్మినరసింహస్వామి

సర్వసభ్య సమావేశానికి అధికారులు డుమ్మా

పలుశాఖల అధికారుల గైర్హాజరుపై సభ్యుల ఆగ్రహం



మాట్లాడుతున్న ఎంపీపీ నూర్జహాన్

కలికిరి : మండల పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశానికి పలుశాఖల అధికారులు గైర్హాజరవ్వడంపై సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ నూర్జహాన్ అధ్యక్షతన, ఎంపీడీఓ భానుమూర్తిరావు ఆధ్వర్యంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. అయితే సమావేశానికి రోడ్లు భవనాల శాఖ, ఎక్సైజ్ శాఖ, ఆర్టీసికి సంబంధించిన అధికారులెవ్వరూ హాజరుకాక పోవడంపై గుట్టపాళెం సర్పంచ్ వెంకటరెడ్డితో పాలు ఇతర సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. అత్యంత ప్రాధాన్యత కల్గిన సమావేశానికి సంబంధిత అధికారులు రాకపోతే ఆ శాఖకు సంబంధించి సమస్యలు ఎవరికి చెప్పాలని ఎంపీడీఓను నిలదీశారు. గైర్హాజరైన అధికారులపై చర్యలు తీసుకోవాలని ఎంపీపీ, ఎంపీడీఓను కోరారు. శాఖల వారి సమీక్షలో భాగంగా మండల వ్యవసాయాధికారి మాట్లాడుతూ పీఎం కిసాన్, అన్నదాత సుఖీభవ పథకాలకు సంబంధించి ప్రతి రైతూ తప్పనిసరిగా ఈకేవైసీ చేయించుకోవాలన్నారు. పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో పాడి రైతులకు 50 శాతం రాయితీతో దాణా ఇస్తున్నట్లు పశువైద్యాధికారి గిరిధర్ తెలిపారు. హౌసింగ్ శాఖకు సంబంధించి ఇప్పటి వరకు ప్రజల నుంచి కాలని నివాసాల కోసం 1450 దరఖాస్తులు వచ్చాయని, ప్రభుత్వ అనుమతులు వచ్చిన వెంటనే అర్హులకు ఇండ్లూరు మంజూరు చేయనున్నట్లు ఏఈ చంద్రశేఖర్ తెలిపారు. ఉపాధి హామీ పథకంలో అమలులో ఉన్న పథకాలను సద్వినియోగం చేసుకునేలా, వేసవిలో కూలీలకు పెంచిన కూలి వేతనం అందుతుందని, ఈ మేరకు ప్రజాప్రతినిధులు ప్రజలకు అవగాహన కల్పించాలని ఏపీఓ కోరారు.

సరిహద్దులలో పోరాటం చేస్తున్న సైనికులకు సలాం



ఉగ్రవాదానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తున్న నిస్సార్ అహమ్మద్, ముస్లింలు

రామసముద్రం : సరిహద్దుల్లో వారి పోరాటం చారిత్రకం...వారి వెన్నంటి మేమంతా వున్నాం...అంటు మదనపల్లె వైఎస్సార్‌సీపీ కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త నిస్సార్ అహమ్మద్‌స్పష్టం చేశారు. శుక్రవారం రామసముద్రం మండలం ఎం.గొల్లపల్లి మదీనా మసీదులో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం జాతీయ జెండాతో సైనికులకు సంఘీభావం ..భారత్ జిందాబాద్...పాకిస్తాన్ ముర్దాబాద్ అంటు నినాదాలు చేశారు. ఆయన మాట్లాడుతూ సరిహద్దులో దేశ ప్రజల రక్షణ కోసం పోరాటం చేస్తున్న రక్షణ సిబ్బంది ప్రతివిధ దళాల జవాన్‌లకు సలాం చేస్తున్నామని తెలిపారు. యావత్ భారతదేశం గర్వించే విధంగా దేశ రక్షణ సిబ్బంది కంచుకోటగా నిలచి ప్రజలను కాపాడటం ఎంతో గర్వంగా ఉందన్నారు. దేశ రక్షణ కోసం పని చేస్తు పౌరులను కాపాడుతున్న ప్రతి ఒక్కరికి సలాం తెలిపారు. దేశ రక్షణే ప్రథమ కర్తవ్యంగా పని చేస్తున్న రక్షణ సిబ్బందికి దేశ ప్రజలంతా సంఘీభావం తెలపాలని కోరారు. భారత ప్రభుత్వానికి ప్రతి ఒక్కరు అండగా నిలబడే సమయం ఇదే అని మేమంతా మీ వెంట ఉన్నామని ప్రకటించారు. ఉగ్రవాదం పైన భారతసైన్యం చేస్తున్న దాడులలో విజయం మనదే అన్నారు. సైన్యానికి తగినంత బలం ఆత్మస్థైర్యం అల్లాహ్ ఆశీస్సులు ఉండాలని ప్రత్యేక ప్రార్థనలు చేయడం జరిగిందని వివరించారు. ఉగ్రవాదం అంతం కావాలని, వారికి మద్దతు ఇచ్చేవారు ఎవరైనా ఓటమి ఎదుర్కొక తప్పదన్నారు. భారతదేశ పౌరులకు నష్టం కలుగకుండ రక్షణగా ఉన్న త్రివిధ దళాలకు ఎలాంటి నష్టం వాటిల్లకుండ ఉగ్రపోరులో విజయం సాధించాలని ప్రత్యేక ప్రార్థనలు చేసినట్లు తెలిపారు.

వీరజవాన్ మురళీనాయక్‌కు ఘన నివాళి



కొవ్వొత్తులతో నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

పీలేరు : పాకిస్తాన్ కాల్పుల్లో వీరమరణం పొందిన సత్యసాయి జిల్లా గోరంట్ల మండలం పుట్టగుండ్ల పల్లె తండాకు చెందిన మురళీనాయక్‌కు పీలేరు వైఎస్సార్‌సీపీ నాయకులు ఘనంగా నివాళులర్పించారు. శుక్రవారం రాత్రి స్థానిక నాలుగు రోడ్ల కూడలిలలో కొవ్వొత్తులు వెలిగించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ దేశం కోసం మురళీనాయక్ పోరాడి తన ప్రాణాలు అర్పించడం బాధాకరమన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు చక్రధర్, నారే వెంకటరమణారెడ్డి, అమరనాథరెడ్డి, ఆనంద్, సపూర, అరుణ, షాకీర్, ఆబీద్, మునీర్, లోకనాథరెడ్డి, కాలనీచిన్న, షబ్బీర్, భువన, పరమేష్, దావూద్ తదితరులు పాల్గొన్నారు.


ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారించాలి



మాట్లాడుతున్న ఏడీఏ వై.వి. రమణరావు

కేవీపల్లె : ప్రకృతి వ్యవసాయంపై రైతులు దృష్టి సారించాలని పీలేరు ఏడీఏ వై.వి. రమణరావు అన్నారు. శుక్రవారం కేవీపల్లెలో ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో పంటలు సాగు చేయడం ద్వారా రైతులు బహుళ ప్రయోజనాలు పొందవచ్చునని తెలిపారు. రైతులు తమ వద్ద లభించే వనరులతో సేంద్రియ ఎరువులు తయారు చేసుకోవచ్చునని చెప్పారు. రసానిక ఎరువులకు స్వస్తి పలికి ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో పంటలు సాగు చేయాలని కోరారు. తద్వారా ఆరోగ్యకరమైన పంట లభిస్తుందని తెలిపారు. రైతులు తక్కువ ఖర్చుతో అధికా ఆదాయం పొందవచ్చునని తెలిపారు. అనంతరం మండలంలోని ఆదర్శ రైతులను సన్మానించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారిణి శ్రావణి, ఏఈవో అనితాదేవి, ఏపీఎం అనురాధ తదితరులు పాల్గొన్నారు.

జనసేన నాయకుడిని అరెస్ట్ చేయాలని డిమాండ్



సమావేశంలో దళిత సంఘాల నాయకులు

పీలేరు రూరల్ : పీలేరులో దళితుల భూమిని కబ్జాకు ప్రయత్నించడం తోపాటు దళితులపై దాడి చేసి కులం పేరుతో దూషించిన జనసేన నాయకుడు కామిశెట్టి సుధాకర్‌ను వెంటనే అరెస్ట్ చేయాలని ఎమ్మార్పీఎస్ నాయకులు ముల్లంగి చంద్రయ్య, మాలమహానాడు జిల్లా కార్యదర్శి జెట్టి మల్లికార్జున డిమాండ్ చేశారు. శుక్రవారం పీలేరులో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ కామిశెట్టి సుధాకర్‌లో గతంలో పీలేరు ప్రాంతంలో అక్రమంగా ఇసుక, మటి అమ్ముకొని కోట్లు సంపాదించి పేద వర్గాలను ఇబ్బంది పెట్టాడని తెలిపారు. ఆయనపై పోలీసులు సమగ్ర విచారణ జరిపి చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. దళిత సంఘాల నాయకులు శ్రీకాంత్, మల్లికార్జున, తిమ్మయ్య, ప్రసాద్, చిరంజీవి, ఓబులేషు, చిన్న, రమణ, ఆంజనేయులు, శ్రీరాములు, నాగేశ్వర తదితరులు పాల్గొన్నారు.

మేనేజర్‌గా రాము

బి.కొత్తకోట : స్థానిక నగర పంచాయతీ మేనేజర్‌గా రాము శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. నగర పంచాయతీ ఏర్పడినప్పటి నుంచి అకౌంటెంట్ రమాదేవి మేనేజర్‌గా అదనపు బాధ్యతలు నిర్వహించారు. ప్రస్తుతం పూర్తిస్థాయి మేనేజర్‌ను ఉన్నతాధికారులు నియమించారు.

ఆరోగ్య పరీక్షలతో సురక్షిత మాతృత్వం



పౌష్టికాహారం పంపిణీ చేస్తున్న డాక్టర్ రమేష్‌రెడ్డి

పీలేరు : ఆరోగ్య పరీక్షలతో సురక్షిత మాతృత్వం సాధ్యమని డాక్టర్ రమేష్‌రెడ్డి అన్నారు. శుక్రవారం తలపులలో పీఎంఎస్ఎంఏ కార్యక్రమంలో భాగంగా గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గర్భిణులు కనీసం నాలుగు సార్లు డాక్టర్‌చే ఆరోగ్య పరీక్షలు చేపించుకోవాలన్నారు. పిండంలో లోపాలు, ఎదుగుదల తెలుసుకోవచ్చునని తెలిపారు. అనంతరం 27 మంది గర్భవతులకు రాజమ్మ సహాయంతో పండ్లు, పాలు, బ్రెడ్లు, పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెచ్ఈ కొండయ్య, పర్యవేక్షకులు కుసుమ, ఏఎన్ఎం నాగవేణి, కృష్ణమ్మ, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

శేషవాహనంపై వెంకన్న



శేషవాహనంపై స్వామివారు

మదనపల్లె సిటీ : స్థానిక దేవళంవీధిలోని శ్రీ ప్రసన్న వెంకటరమణస్వామి బ్రహ్మోత్సవాలు కనుల పండువగా నిర్వహిస్తున్నారు. ఐదో రోజు శుక్రవారం సాయంత్రం నెహ్రూనగర్ వాసులు ఉభయదారులగా స్వామి శేషవాహనంపై విహరించారు. రాత్రి బండమీదకమ్మపల్లె ఉభయదారులుగా స్వామి హంస వాహంపై భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం ఆలయంలో స్వామికి అభిషేకాలు, హోమాలు నిర్వహించారు. బ్రహ్మోత్సవాలు పురస్కరించుకుని భక్తులు స్వామిని దర్శించుకున్నారు. ఆలయంలో సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా హరికథ, భజన, లలిత సహస్రనామ ప్రవచనాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ రమణ, మాజీ చైర్మన్ బింగి పాండు, గంగారపు భాస్కర్‌రెడ్డి, బింగి నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

రేపు అరుణాచలానికి ప్రత్యేక బస్సు సర్వీస్

పీలేరు రూరల్ : పౌర్ణమిని పురస్కరించుకుని ఆదివారం పీలేరు నుంచి అరుణాచలానికికు ప్రత్యేక బస్సు సర్వీసు నడుపుతున్నట్లు స్థానిక ఆర్టీసీ డీఎం నిర్మల తెలిపారు. ఆదివారం మధ్యాహ్నం 2 గంటలకు ఎక్స్‌ప్రెస్ బస్సు సర్వీసు బయలుదేరుతుందని ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆన్‌లైన్‌లో సీటు రిజర్వేషన్ చేసుకోవాలని కోరారు. వివరాలకు 9441774743 నెంబర్‌ను సంప్రదించాలన్నారు.

11న తిరువణ్ణామలైకి ప్రత్యేక బస్సులు

మదనపల్లె సిటీ : పౌర్ణమిని పురస్కరించుకుని ఈనెల 11వతేదీన తిరువణ్ణామలైకి ప్రత్యేక బస్సులు నడపనున్నట్లు ఆర్టీసీ–2 డిపో మేనేజర్ అమర్‌నాథ్ తెలిపారు. అల్ట్రాడీలక్స్ బస్సులో చార్జీ రూ.705 చెల్లించాలన్నారు. ముందుగా టిక్కెట్లు రిజర్వేషన్ చేసుకోవాలన్నారు. భక్తులు ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించాలని కోరారు.

ఘనంగా గ్రామదేవత ఊరేగింపు

బి.కొత్తకోట : స్థానిక గ్రామదేవత నల్లవీర గంగమ్మ ఉత్సవ ఊరేగింపు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఏటా నిర్వహించే ఉత్సవంలో భాగంగా ఆర్యవైశ్య వీధిలోని ఆలయం నుంచి గంగమ్మ ఉత్సవ విగ్రహాన్ని కొలువు తీర్చిన పల్లకీలో ఊరేగింపుగా పుట్టినిల్లుగా భావించే దేగానిపల్లికి తీసుకెళ్లారు. అక్కడ భక్తులు పట్టుచీర పసుపు, కుంకుమ సమర్పించారు. ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. అక్కడినుంచి తిరిగి ఉత్సవ పల్లకి ఆలయానికి చేరుకుంది. పెద్ద సంఖ్యలో భక్తులు గంగమ్మను దర్శించుకుని పూజలు చేశారు.

ప్రతి ఒక్కరికీ అండగా నిలుస్తా

ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి



నూతన వధూవరులతో ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి

తంబళ్లపల్లె : నియోజకవర్గంలో ప్రజల సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తూ ఎలాంటి కష్టనష్టాలు వచ్చినా ప్రతి ఒక్కరికీ అండగా నిలుస్తానని ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి భరోసా ఇచ్చారు. శుక్రవారం ఆయన అన్నగారిపల్లెలో పర్యటించారు. వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి జయసింహారెడ్డి మేనల్లుడు వినోద్‌రెడ్డి, అమని నూతన వధూవరుల పెళ్లికి హాజరై ఆశీర్వదించారు. సమస్యల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కొంత సమయనం పాటిస్తే భవిష్యత్తులో వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వస్తుందన్నారు. కూటమి ప్రభుత్వం అరాచకపాలన, అక్రమ కేసులతో వేధింపులపై అందరూ ఐక్యం కావాలన్నారు. కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరించి చైతన్య పరచాలన్నారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు శ్రీకర్‌రెడ్డి, మహదేవరెడ్డి, రమణారెడ్డి, సుధాకర్‌రెడ్డి, ఎంపీటీసీ మహేష్, పుట్టా శేఖర్‌గుప్తా, పీజె వెంకటరమణారెడ్డి, జయనారాయణరెడ్డి పాల్గొన్నారు.

రోడ్ల మరమ్మతులు పట్టించుకోండి సారూ..!

ఏఓ రాఘువేంద్రకు బీవైఎస్ వినతి



సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద రోడ్ల దుస్థితిపై ఫ్లకార్డులు ప్రదర్శిస్తున్న బీవైఎస్ పునీత్, సభ్యులు

మదనపల్లె రూరల్ : పట్టణంలోని ప్రధాన రహదారులన్నీ గుంతలతో గోతులమయంగా తయారయ్యాయని, రోడ్ల మరమ్మతులు కనీసం మీరైనా పట్టించుకోండి సారూ అంటూ బహుజన యువసేన(బీవైఎస్) రాష్ట్ర అధ్యక్షులు పునీత్ కోరారు. శుక్రవారం సబ్ కలెక్టర్ కార్యాలయంలో పట్టణంలోని రోడ్ల దుస్థితిపై ఫ్లకార్డులు ప్రదర్శిస్తూ నిరసన తెలిపారు. అనంతరం సబ్ కలెక్టర్ మేఘస్వరూప్ అందుబాటులో లేకపోవడంతో..ఏఓ రాఘువేంద్రను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా పునీత్ మాట్లాడుతూ...పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని కోమటివాని చెరువు కట్టమీద రోడ్డుపై నిత్యం వందల సంఖ్యలో వాహనాలు ప్రయాణిస్తుంటాయన్నారు. రోడ్డుమొత్తం గుంతలమయంగా మారడం, రోడ్డుకు ఇరువైపులా ఏర్పాటుచేసిన సేఫ్టీ ఇనుపరాడ్స్ పాడైపోయి చెరువులోకి పడిపోయాయని, ప్రమాదవశాత్తు అదుపుతప్పితే అటు చెరువులోకి, ఇటు మెయిన్‌రోడ్డులోకి పడి ఏకంగా ప్రాణాలు పోయే పరిస్థితి ఉందన్నారు. అలాగే మదనపల్లె–నిమ్మనపల్లె రోడ్డు మూడేళ్లుగా గుంతలు, గోతులతో ప్రమాదకరంగానే ఉందన్నారు. దీంతో ఎక్కువ రోడ్డు ప్రమాదాలు జరిగి ప్రాణాలు కోల్పోవడం జరుగుతోందన్నారు. టీడీపీ నాయకులు అధికారంలో లేనప్పుడు...రోడ్ల దుస్థితిపై పలు నిరసన కార్యక్రమాలు, ధర్నాలు చేశారన్నారు. అధికారంలోకి వచ్చాక...గుంతలరహిత రాష్ట్రంగా ఏపీ పేరుతో రోడ్లకు అతుకులు వేస్తామని ఆర్భాటంగా ప్రకటించారని, తప్పితే మరమ్మతులు చేసిన పాపాన పోలేదన్నారు. ప్రజాసమస్యలపై ప్రజాప్రతినిధులు ఎలాగూ పట్టించుకోవడం లేదని, అధికారులుగా మీరైనా పట్టించుకుని రోడ్ల మరమ్మతులు చేయించాలని వినతిచేశారు. కార్యక్రమంలో బీవైఎస్ నాయకులు హరికృష్ణ, శ్రీనివాసులు, శశికుమార్, బాలకృష్ణ, వినయ్, తారక్, ఉదయ్, గౌతమ్, త్రిలోక్, జగదీష్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి కూలీలకు రూ.600 వేతనం ఇవ్వాలి

- 200 పనిదినాలు కల్పించాలి
- మే 20న సమ్మె జయప్రదం చేయాలి



ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు పి.శ్రీనివాసులు

మదనపల్లె రూరల్ : ఉపాధిహామీ కూలీలకు రోజుకు రూ.600 వేతనం ఇవ్వాలని, 200 రోజుల పనిదినాలు కల్పించాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మికసంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు పి.శ్రీనివాసులు డిమాండ్ చేశారు. శుక్రవారం మదనపల్లె మండలంలోని పోతబోలు, భూమకవారిపల్లె, నేతాజీకాలనీ తదితర పనిప్రదేశాల్లో పర్యటించి కూలీల సమస్యలు తెలుసుకున్నారు. కార్మికవర్గం, రైతాంగం దేశవ్యాప్తంగా మే 20న చేపడుతున్న సార్వత్రిక సమ్మెలో ఉపాధి కార్మికులు పాల్గొని జయప్రదం చేయాలన్నారు. ఈ సందర్భంగా పి.శ్రీనివాసులు మాట్లాడుతూ....వ్యవసాయ పనులు తగ్గిపోతున్న నేపథ్యంలో రెక్కల కష్టమే ఆధారంగా జీవిస్తున్న కూలీలకు 100రోజుల ఉపాధిపనులే దిక్కు అవుతున్నాయన్నారు. కూలీలందరికీ 100 రోజుల పనులు చూపించాలంటే కేంద్రప్రభుత్వం బడ్జెట్లో రూ.2.50లక్షల కోట్లు కేటాయించాలి. కానీ కేవలం 83వేల కోట్లు మాత్రమే కేటాయించిందన్నారు. వాటిని రాష్ట్రప్రభుత్వం పక్కదారి పట్టిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. పనచేసిన రెండువారాల్లోపు వేతనాలు ఇవ్వాల్సి ఉన్నా 13 వారాలుగా వేతనాలు ఇవ్వడం లేదని, రోజువారి కూలిడబ్బులతో పూట గడిచే కూలీలకు 100 రోజులవుతున్నా వేతనాలు ఇవ్వకపోతే ఎలా బతకాలని ప్రశ్నించారు. ఎంపీ, ఎమ్మెల్యేలు తమ జీతాలను నెలకు రూ.50వేలకు పైగా పంచుకున్నారని, కానీ ఉపాధి కూలీలకు మాత్రం కేవలం ఏడురూపాయలు పెంచారని అన్నారు. పనిప్రదేశంలో కనీస వసతుల ఊసే లేదని, పనిముట్లు ఎనిమిదేళ్లుగా ఇవ్వకపోతే పనులు ఎలా చెయ్యాలన్నారు. మే 20న కార్మికులు తమ చట్టాలు, పనిభద్రత కోసం దేశవ్యాప్త సమ్మె చేస్తున్నారని, పంటలకు గిట్టుబాటు ధరలు, చట్టం కోసం రైతులు గ్రామీణ హర్తాల్ చేస్తున్నారని, ఉపాధిహామీ చట్టం రక్షణ కోసం కూలీలు మే20న ఉపాధి పనులు బంద్ చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఉపాధిహామీ పథకం కూలీలు పాల్గొన్నారు.

బాలికల అభివృద్ధికి సమష్టి కృషి అవసరం



అవగాహన కల్పిస్తున్న సీడీపీఓ రాజమ్మ

కేవీపల్లె : బాలికలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందడానికి సమష్టి కృషి అవసరమని ఐసీడీఎస్ సీడీపీవో రాజమ్మ అన్నారు. శుక్రవారం మండలంలోని పెద్దపల్లె హరిజనవాడ అంగన్‌వాడీ సెంటర్‌లో కిశోరవికాసం సమ్మర్ క్లాస్ మూడవ రోజు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాల్య వివాహాలు చేసుకోవడం వలన కలిగే అనర్థాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. కిషోర్ బాలికలకు ఆహార భద్రత, హెల్ప్‌లైన్, విద్య గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, సిబ్బంది పాల్గొన్నారు.

రేపు ఉచిత వైద్య శిబిరం

కురబలకోట : బెంగళూరులోని వైదేహి సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ సౌజన్యంతో బలిజ (కాపు) సంఘం జిల్లా అధ్యక్షులు శెట్టి సీతారాం ఆధ్వర్యంలో మండలంలోని అంగళ్లు జడ్పీ హైస్కూల్‌లో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు హాస్పిటల్ కో ఆర్డినేటర్ పి.ఎన్. లోకేశ్వర్ తెలిపారు. క్యాన్సర్, గుండె, కిడ్నీ, బీపీ, షుగర్, గ్యాస్ట్రో ఎంట్రాలజీ, న్యూరాలజీ తదితర వ్యాధులతో బాధపడుతున్న వారికి వైద్య నిపుణులతో చికిత్స నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ప్లాస్టిక్ సర్జరీకి కూడా సంప్రదించవచ్చని తెలిపారు. అవసరమైన వారికి ఎన్టీఆర్ వైద్య సేవ స్కీం ద్వారా ఉచితంగా ఆపరేషన్లు చేయడం జరుగుతుందని తెలిపారు. అవకాశాన్ని బాధితులు వినియోగించుకోవాల్సిందిగా కోరారు.

రేపు టీ.సదుంలో..

పెద్దతిప్పసముద్రం : మండలంలోని టి.సదుంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నారు. యంగ్ ఇండియా సేవా ఫౌండేషన్ వారి ఆధ్వర్యంలో బెంగళూరులోని వైదేహీ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి వారి సహకారంతో నిర్వహించే ఈ శిబిరానికి గుండె, కేన్సర్, కీళ్ళ నొప్పులకు సంబంధించి ప్రముఖ్య వైద్య నిపుణులు హాజరై వైద్య పరీక్షలు చేస్తారు. మండల పరిసర ప్రాంతాల ప్రజలు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఫౌండేషన్ అధ్యక్షుడు రాజశేఖర్ శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు.